RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:75 | ఫిబ్రవరి 27, 2026 | వెల: రూ.3-00

## సీఎంఓ అధికారిగా నటించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్



2లో

## దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోంది..



### భూదాన్ భూముల్లో పేదల ఇళ్లు తొలగించడం అన్యాయం

- అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్ల స్థలాలు ఇస్తాం
- అసెంబ్లీలో ఖమ్మం సమస్య ప్రస్తావిస్తాం
- వెలుగుమట్ల కూల్చివేతలపై కేటీఆర్ ఆగ్రహం

2లో

## బీఆర్ఎస్ హయాంలోనే గుడిసెల కూల్చివేత

### పేదల పేరుతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు

- అర్హులైన వారికి ఇల్లు, స్థలం ఇస్తాం
- వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



2లో

## అడగకముందే అప్పు.. తీర్చకపోతే చావు!




### లోన్ మాఫియా అరాచకం

#### యమపాశాలుగా లోన్ యాప్స్

- వడ్డీల మీద వడ్డీలు.. కట్టకుంటే వేధింపులు
- మొదట లోన్ కోసం ఫోన్ల మీద ఫోన్లు
- తీసుకునేదాక వెంటబడుతున్న వైనం
- ఆ తర్వాతే మొదలవుతున్న అసలు కథ
- రకరకాల ఫీజుల పేరుతో ఇచ్చే లోన్లో కోర్రీలు
- ఒక్క నెల లేటయినా రికవరీ ఏజెంట్ల ఫోన్ టార్చర్
- పరువు తీస్తామంటూ బెదిరింపులు..
- కుటుంబసభ్యలకూ ఫోన్లు.. మానసిక వేధింపులు
- లోన్ మాఫియా బారిన చిక్కుకోవద్దని హెచ్చరిస్తున్న పోలీసులు

2లో

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. నిమిషాల్లో లోన్ అంటూ వస్తున్న ప్రకటనలు నేడు సామాన్యుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. అత్యవసరాల కోసం లేదా మాయ మాటలు నమ్మి ఈ యాప్‌ల ద్వారా అప్పు తీసుకున్న వారు, తిరిగి చెల్లించలేక, వేధింపులు భరించలేక ప్రాణాలు వదులుతున్నారు. లోన్ మాఫియా సాగిస్తున్న ఈ రాక్షస దందా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. అడగకముందే అప్పు అంటగట్టడం, ఆపై వడ్డీల మీద వడ్డీలు వేస్తూ అసలు కంటే రెట్టింపు వసూలు చేయడం ఈ మాఫియా ప్రధాన వ్యూహం. కేవలం ఒక్క రోజు పేమెంట్ ఆలస్యమైతే చాలు.. అనామక రికవరీ ఏజెంట్లు రాక్షసుల్లా మారి ఫోన్ కాల్స్‌తో నరకం చూపిస్తున్నారు. బాధితుల కాంటాక్ట్ లిస్టును చోరీ చేసి, వారి బంధువులకు, స్నేహితులకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడం, ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించడం వంటి సామాజిక వేధింపులతో నిలువునా పరువు తీస్తున్నారు.

## ప్రభుత్వ విద్యకు కొత్త దిశ



2లో

- కోర్ అర్బన్ ప్రాంత పాఠశాలలకు అత్యున్నత మౌలిక వసతులు
- ఉదయ భోజన పథకం, పాల సరఫరా పకడ్బందీగా అమలు
- అధిక ఫీజులపై కఠిన నిబంధనలు
- రవాణా సదుపాయాల పైలట్ ప్రాజెక్ట్
- సమగ్ర మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం

## నిరుపయోగంగా ఓపెన్ జిమ్!

### రెండు లక్షలు.. మూడే పరికరాలు.. మిగతా నిధులు ఎక్కడ?

- ప్రదేశం ఎంపికపైనా అనుమానాలు
- ఊరికి దూరంగా నిర్మాణం.. వినియోగం శూన్యం
- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వేద న్యూస్, గన్నేరువరం**

గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతి వనాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అయితే కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. గ్రామంలో కనీసం ప్రజలు ఎక్కువగా రాని ప్రాంతంలో జిమ్ ఏర్పాటు చేయడంతో వినియోగం లేకపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ జిమ్‌లో కేవలం మూడు పరికరాలే ఉండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మూడే పరికరాలకు రెండు లక్షలు ఖర్చవుతాయా? మిగతా నిధులు ఎక్కడికి వెళ్లాయి? ఏ ప్రమాణాల ప్రకారం ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశారు? అనే ప్రశ్నలు గ్రామ ప్రజలు లేవనెత్తుతున్నారు. జిమ్‌కు సరిపడ పరికరాలు లేకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రజాధనం వృథా అయిందని వారు విమర్శిస్తున్నారు. గత పాలకులు, అధికారులు చేసిన పొరపాట్లనే ప్రస్తుత అధికారులు కూడా కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఓపెన్ జిమ్‌ను పూర్తిస్థాయి పరికరాలతో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వేద న్యూస్

శుక్రవారం | ఫిబ్రవరి 27, 2026

# మిషన్ మిర్యాలగూడ ఫలితం

- నకిలీ కంటి వైద్యుల అరెస్ట్
- పోలీసు శాఖ చర్యలపై హెచ్ఆర్డీఏ ప్రశంస

**వేద న్యూస్, మిర్యాలగూడ**

మిర్యాలగూడలో నకిలీ కంటి వైద్యులను అరెస్ట్ చేయడాన్ని హెల్త్ కేర్ రీఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ వరంగల్ శాఖ అభినందించింది. ప్రజారోగ్య పరిరక్షణలో ఇది కీలక అడుగని పేర్కొంది. క్వాకరీకి వ్యతిరేకంగా వరంగల్ వైద్యుడు, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ డా. వేములపల్లి నరేష్ కుమార్ నేతృత్వంలో చేపట్టిన మిషన్ మిర్యాలగూడ కార్యక్రమం ఫలితంగానే ఈ అరెస్టులు జరిగాయని వెల్లడించింది. గతంలో అందిన ఫిర్యాదుల మేరకు గత సంవత్సరం డిసెంబర్ 19న డా. నరేష్ కుమార్, డా. కె. రవి కుమార్, డా. జూకూరు శ్రీకాంత్ మరియు విజిలెన్స్ అధికారి రాకేష్ బృందాలుగా ఏర్పడి పలు నకిలీ కంటి వైద్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆధారాలు సేకరించారు. ఆ ఆధారాలపై జనవరి 21న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఐదుగురు నకిలీ కంటి వైద్యులను అరెస్ట్ చేశారు. నకిలీ వైద్యుల సేవలు ప్రజారోగ్యానికి ముప్పని, మెడికల్ కౌన్సిల్‌లో నమోదు లేని వ్యక్తుల వద్ద చికిత్స పొందకూడదని హెచ్ఆర్డీఏ వరంగల్ అధ్యక్షుడు డా. కొలిపాక వెంకట స్వామి హెచ్చరించారు. అనుమానాస్పద వైద్య కేంద్రాలపై సమాచారం టీజీఎంసీ వాట్సాప్ నంబర్ 9154382727కు అందించాలని కోరారు. ఇలాంటి వారిపై మెడికల్ కౌన్సిల్, పోలీసు శాఖ, ప్రజాసంఘాల సమన్వయంతో కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.




# సీఎంఓ అధికారిగా నటించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

### బెట్టింగ్ వ్యసనం కోసం పలు జిల్లాల్లో మోసాలు

**వేద న్యూస్, బోయినిపల్లి**

ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి అని చెప్పుకుంటూ ప్రభుత్వ అధికారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వేములవాడ ప్రాంత సహాయ పోలీసు అధికారి రుత్విక్ సాయి తెలిపారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరుకు చెందిన రాయబండి సూర్యప్రకాశ్ (45) ఈ మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. గుర్రపు పందేల బెట్టింగ్ వ్యసనం కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. గతంలో ద్విచక్ర వాహనాల దొంగతన కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లినట్లు తెలిపారు. జైలు నుంచి విడుదలైన అనంతరం సీఎం కార్యాలయంలో పనిచేస్తున్నానని చెప్పుకుంటూ పలు ప్రభుత్వ అధికారులకు ఫోన్ చేసి, "సీఎంఓ నుంచి మాట్లాడుతున్నాను" అంటూ డబ్బు డిమాండ్ చేసేవాడు. ఫోన్‌పే ద్వారా నగదు పంపాలని, లేదంటే అధికారిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించేవాడు. ఈ విధంగా వసూలు చేసిన డబ్బును బెట్టింగ్‌లో ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 23న మిడ్ మానేర్ డ్యామ్ ఉపవిభాగ అధికారి రఘుపతికి ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేయగా, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోదురుపాక వద్ద డబ్బు తీసుకునేందుకు వచ్చిన నిందితుడిని సాంకేతిక ఆధారాలతో అరెస్ట్ చేసి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై హైదరాబాద్, సిద్దిపేట, జగిత్యాల తదితర ప్రాంతాల్లో పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్ మరియు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.




# బీఆర్ఎస్ హయాంలోనే గుడిసెల కూల్చివేత

- పేదల పేరుతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు
- అర్హులైన వారికి ఇల్లు, స్థలం ఇస్తాం
- వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్లలో పేదల గుడిసెల కూల్చివేత అంశంపై మీడియా సమావేశంలో స్పందించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 2023 జూలై 15న వెలుగుమట్లలో పేదల గుడిసెలను కూల్చివేశారని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు అదే నాయకులు పేదల ఇళ్లు కూలగొడుతున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పేదలపై ప్రేమ ఉన్నట్టు గోబెల్స్ తరహా ప్రచారం చేయడం సరికాదని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం పేదల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిందని, నిజమైన ఏ పేదవాడినీ ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో బాధితులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. నష్టపోయిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల ముందుంచుతామని, పేదల సంక్షేమంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

# అడగకముందే అప్పు.. తీర్చకపోతే చావు!

- రాష్ట్రంలో లోన్ మాఫియా అరాచకం
- యమపాశాలుగా లోన్ యాప్స్..
- వడ్డీల మీద వడ్డీలు.. కట్టకుంటే వేధింపులు
- మొదట లోన్ కోసం ఫోన్ల మీద ఫోన్లు
- తీసుకునేదాక వెంటబడుతున్న వైనం
- ఆ తర్వాతే మొదలవుతున్న అసలు కథ
- రకరకాల ఫీజుల పేరుతో ఇచ్చే లోన్లో కోర్రీలు
- ఒక్క నెల లేటయినా రికవరీ ఏజెంట్ల ఫోన్ టార్చర్
- పరువు తీస్తామంటూ బెదిరింపులు..
- కుటుంబసభ్యులకూ ఫోన్లు.. మానసిక వేధింపులు
- లోన్ మాఫియా బారిన చిక్కుకోవద్దని హెచ్చరిస్తున్న పోలీసులు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

ఆధునిక కాలంలో స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. నిమిషాల్లో లోన్ అంటూ వస్తున్న ప్రకటనలు సామాన్యుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. అత్యవసరాల కోసం లేదా ఆశకు పోయి ఈ యాప్‌ల ద్వారా అప్పు తీసుకున్న వారు, తిరిగి చెల్లించలేక ప్రాణాలు వదులుతున్నారు. లోన్ మాఫియా సాగిస్తున్న ఈ దందా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారుతోంది. ఆకర్షణీయమైన ఆఫర్లతో వల విసిరి, నిలువునా ముంచేస్తున్న ఈ అక్రమ లోన్ మాఫియా బాగోతంపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం.




### అడగకముందే లోన్.. బురిడీ కొట్టిస్తున్న వైనం!

మీకు లోన్ కావాలా? మీ పేరు మీద రూ. 5 లక్షల ఆఫర్ ఉంది.. అంటూ రోజుకు పదుల సంఖ్యలో ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. వినియోగదారుడు పొరపాటున ఆ లింక్ క్లిక్ చేసినా లేదా యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నా చాలు.. లేనిపోని మాటలతో వారికి ఆశ కల్పించి నగదును అకౌంట్లో జమ చేస్తున్నారు. అడగకముందే అప్పు ఇచ్చి, ఆ తర్వాత అసలు కంటే రెట్టింపు వడ్డీలను వసూలు చేయడం ఈ మాఫియా ప్రధాన లక్ష్యం. ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు కట్ చేసుకుని, రోజుల వ్యవధిలోనే మొత్తం డబ్బు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు.

### వడ్డీల మీద వడ్డీలు.. రికవరీ ఏజెంట్ల నరకం!

ఒక్క రోజు పేమెంట్ లేటయినా చాలు.. పెనాల్టీలు, వడ్డీల మీద వడ్డీలు వేస్తూ అప్పును కొండంత చేస్తారు. పొరపాటున కట్టలేని పరిస్థితి ఉంటే, అప్పుడు రంగంలోకి రికవరీ ఏజెంట్లు దిగుతారు. వీరు మనుషులు కాదు, సాక్షాత్తు రాక్షసుల కంటే ఘోరంగా వ్యవహరిస్తారు. ఫోన్ కాల్స్ చేస్తూ అడ్డగోలుగా మాట్లాడటం, నోటికొచ్చినట్లు బూతులు తిట్టడం వీరి నిత్యకృత్యం. బాధితులు భయపడితే మరింత రెచ్చిపోయి, మానసికంగా కుంగిపోయేలా టార్చర్ పెడుతుంటారు.

### కాంటాక్ట్ లిస్ట్ పర్మిషన్..

ఈ యాప్‌లు ఇన్‌స్టాల్ చేసేటప్పుడే ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్ పర్మిషన్ తీసుకుంటాయి. అప్పు కట్టలేదని తెలిస్తే చాలు.. బాధితుడి ఫోన్ నంబర్లలో ఉన్న బంధువులకు, స్నేహితులకు, చివరకు ఆఫీస్ కొలీగ్స్‌కు కూడా ఫోన్ చేస్తారు. 'మీ వాడు అప్పు తీసుకుని ఎగ్గొట్టాడు.. వాడు ఒక దొంగ' అంటూ అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిస్తారు. బాధితుడి ఫోటోలను మార్ఫింగ్ చేసి కాంటాక్ట్ లిస్టులో ఉన్న అందరికీ పంపిస్తామని బెదిరిస్తారు. ఈ సామాజిక అవమానాన్ని తట్టుకోలేక చాలా మంది పరువు కోసం బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం!

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల లోపు మాత్రమే రికవరీ కాల్స్ చేయాలి. కానీ ఈ లోన్ యాప్ ఏజెంట్లు అర్ధరాత్రి, తెల్లవారుజామున కూడా ఫోన్ చేస్తూ నిద్ర లేకుండా చేస్తారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ లేని చైనా యాప్‌లు, అక్రమ సంస్థలు ఈ దందా వెనుక ఉన్నాయి. బాధితుడు ఎంత కట్టినా ఏదో ఒక సాకుతో మళ్ళీ డబ్బులు డిమాండ్ చేయడం వీరి ప్రత్యేకత.

### లోన్ యాప్స్ బారిన పడకండి!

అత్యవసరాల కోసం అనామక యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. మీ వ్యక్తిగత సమాచారాన్ని, కాంటాక్ట్ లిస్టును యాక్సెస్ చేసే పర్మిషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ఒకవేళ ఎవరైనా వేధింపులకు గురిచేస్తుంటే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి. చిన్న అప్పు కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఇటువంటి లోన్ మాఫియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు.

# దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోంది..

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను పరిశీలించారు. బాధితులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీలో ఖమ్మం ప్రజల సమస్యను ప్రస్తావిస్తామని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలే జరుగుతున్నాయని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీని స్వయంగా పరిశీలించానని, ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల భూమిపై కన్ను పడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలసికట్టుగా ఈ చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎవరికీ అన్యాయం జరగలేదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగిన కూల్చివేతలు బాధాకరమని అన్నారు. ఇక్కడి ప్రజలకు అండగా నిలబడేందుకే తాను వచ్చానని తెలిపారు. అవసరమైతే కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు. ఇళ్ల కూల్చివేతపై బాధితుల తరఫున తమ న్యాయ బృందం పోరాడుతుందని, బాధితులకు ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయం సాధించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మీ అందరికీ న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.



# 'మూసీ రివర్‌ఫ్రంట్'కు అన్వేష్ మద్దతు

- ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ప్రతిపాదనపై స్పందన
- పర్యాటక ఆర్థిక లాభాల కోణంలో చూడాలని సూచన
- సామాన్యుల ఇళ్లపై ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**





తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని నిర్మించాలనే ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయానికి మద్దతు ప్రకటించారు. విగ్రహాల నిర్మాణాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా, పర్యాటక ఆర్థిక ప్రయోజనాల దృష్టితో చూడాలని సూచించారు. గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఉదాహరణగా చూపిస్తూ అన్వేష్ విశ్లేషణ చేశారు. సర్దార్ పటేల్ విగ్రహం నిర్మాణ సమయంలో వచ్చిన విమర్శలను గుర్తుచేస్తూ, ఆ ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం లభించిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రతిపాదించిన గాంధీ విగ్రహం కూడా భవిష్యత్తులో తెలంగాణకు ఆర్థిక లాభాలు చేకూరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు కూడా మెరుగుపడతాయని చెప్పారు. తాను ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, అభివృద్ధి వైపే తన మద్దతు ఉంటుందని అన్వేష్ స్పష్టం చేశారు. పర్యావరణం లేదా ఇతర కారణాలను చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. పలు దేశాల్లో పర్యాటక కేంద్రాల అభివృద్ధి తర్వాతే మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందాయని తన అనుభవంతో వివరించారు. అయితే, ప్రాజెక్టు అమలులో సామాన్య ప్రజల ఇళ్లను కూల్చడం వంటి చర్యలు చేపట్టకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక అభివృద్ధి, సామాజిక న్యాయం రెండింటినీ సమతుల్యం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ విద్యకు కొత్త దిశ

- కోర్ అర్బన్ ప్రాంత పాఠశాలలకు అత్యున్నత మౌలిక వసతులు
- ఉదయ భోజన పథకం, పాల సరఫరా పకడ్బందీగా అమలు
- అధిక ఫీజులపై కఠిన నిబంధనలు
- రవాణా సదుపాయాల పైలట్ ప్రాజెక్ట్
- సమగ్ర మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యాశాఖపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపు దిశగా కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు సామాన్యుల ఆశ్రయంగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ విద్య అందించే కేంద్రాలుగా మారాలనే లక్ష్యంతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లోటుపాట్లను వెంటనే గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారు. యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలల నిర్మాణంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆయన కఠినంగా సూచించారు. ఈ పాఠశాలలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఆధునిక తరగతి గదులు, సాంకేతిక సదుపాయాలు, శాస్త్ర ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి అన్ని వసతులు కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు భారతీయ విద్యా భవన్, జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ తరహాలో ప్రమాణాలతో అభివృద్ధి చెందాలనే దిశగా కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉదయ భోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితి మెరుగుపడేలా పోషకాహారం అందించడమే లక్ష్యమని చెప్పారు. ఈ పథకంలో అందించే పాలను విజయా డైరీ నుంచి సేకరించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా, చదువుపై దృష్టి కేంద్రీకరించే వాతావరణం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. కోర్ అర్బన్ ప్రాంతం మినహా ఇతర నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని ప్రతిపాదించారు. విద్యుత్ బస్సుల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేసి, పర్యావరణ హిత చర్యలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు వసూలైన మొత్తాన్ని తిరిగి పొందేలా కఠిన నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫారసులను ప్రజాభిప్రాయం కోసం అధికారిక వెబ్‌సైట్లలో ఉంచి పారదర్శకతను పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను సమాన అవకాశాల వేదికగా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# నాడు నల్లకోటుతో కోర్టులో..

## – నేడు వేములవాడలో యాచకుడిగా జీవితం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



సినిమా కథను తలపించేలా ఓ న్యాయవాది జీవితం మారిపోయింది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన కాసర్ల జలంధర్ 2005లో ఎల్ఎల్బీ పూర్తి చేసి 2020 వరకు న్యాయవాదిగా సేవలందించారు. అయితే కరోనా కాలంలో ప్రాక్టీస్ దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనడంతో ప్రస్తుతం భార్యతో కలిసి వేములవాడలో యాచకుడిగా జీవనం సాగిస్తున్నారు. చదువుకున్న వ్యక్తి ఇలాంటి పరిస్థితికి చేరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఏఎస్పీ చంద్రయ్య వేములవాడలో భిక్షాటన చేస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ పునరావాస చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జలంధర్, శిరీష దంపతులు అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడటం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. అధికారులు ఉపాధి అవకాశాలు కల్పిస్తే పనిచేసుకుంటూ జీవనం సాగించేందుకు సిద్ధంగా ఉన్నామని దంపతులు తెలిపారు.

# కానిస్టేబుళ్లకు ప్రశంసలు, నగదు బహుమతి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు గంగరాజు, అనిల్‌లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. వేములవాడ తిప్పా పూర్ బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ నిర్వహించి గంగరాజు ప్రాణాలు కాపాడగా, తంగళ్లపల్లి వద్ద మానేరు వాగులో దూకి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని గంగరాజు, అనిల్‌లు ధైర్యసాహసాలతో రక్షించారు. ప్రాణాపాయం లెక్కచేయకుండా సమయస్ఫూర్తితో స్పందించిన కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణరక్షణే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

# నేతాజీ జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

## – విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర' అనే అంశంపై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. నేటి తరం విద్యార్థులు నేతాజీని ఆదర్శంగా తీసుకుని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. నేతాజీ ఆలోచనలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు అమిరీశెట్టి భూమిరెడ్డి, నేతాజీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఏడపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బిల్డర్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- సెల్ఫీ వీడియోలో ఆరోపణలు
- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు
- కరీంనగర్‌లో ఘటన

**వేద న్యూస్, కరీంనగర్ బ్యూరో:**



బిల్డర్ వేధింపులు భరించలేక ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కరీంనగర్‌లో కలకలం రేపింది. కరీంనగర్ కార్ఖానాగడ్డకు చెందిన బీమా రాజ్ కుమార్ తన పట్టా భూమి 500 స్క్వేర్ ఫీట్లలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కోతిరాంపూర్‌కు చెందిన బిల్డర్ జనగామ భిక్షపతితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. స్క్వేర్ ఫీట్‌కు రూ.2,060 చొప్పున 10 నెలల్లో ఇల్లు పూర్తి చేసి ఇస్తానని, బ్యాంకు రుణం కూడా ఇప్పిస్తానని చెప్పి అగ్రిమెంట్‌పై సంతకాలు తీసుకుని పనులు ప్రారంభించారని రాజ్ కుమార్ వీడియోలో పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.24 లక్షలు తీసుకున్నప్పటికీ నిర్మాణం పూర్తి చేయలేదని, తమ అనుమతి లేకుండా అదనంగా ఫ్లోర్ స్లాబ్ వేసి ఇల్లు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, గుర్తు తెలియని వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని, గతంలో ఇంటి తాళాలు పగులగొట్టి తన తాళాలు వేసుకున్నాడని వీడియోలో తెలిపారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజ్ కుమార్ ఉదయం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుడి కుటుంబ సభ్యులు సంబంధిత బిల్డర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న నేపథ్యంలో భర్తకు ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందని బాధితుడి భార్య ఆవేదన వ్యక్తం చేసింది.

# మార్చి 6న వేములవాడలో శివ కల్యాణం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 6వ తేదీన పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి శివ కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల భాగంగా రెండవ రోజు అయిన మార్చి 6న స్వామివారి కళ్యాణ మహోత్సవం జరగనుంది. 5వ తేదీ సాయంత్రం కామదహనం కార్యక్రమం నిర్వహించనున్నారు. తదుపరి మూడు రోజుల పాటు డోలోత్సవాన్ని అంతర్గతంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్న నేపథ్యంలో దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు సమాచారం.

# సర్పంచులను అవమానించిన అధికారులను సస్పెండ్ చేయాలి

- డీపీఓ, డీఎల్పీఓలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సర్పంచులకు వెంటనే క్షమాపణ చెప్పాలి
- టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జ్ తిప్పారపు సంపత్

**వేద న్యూస్, హుజూరాబాద్:**



హుజూరాబాద్ మండలం సింగపూర్ కిట్స్ కాలేజీలో సైదాపూర్, వీణవంక మండలాలకు చెందిన 53 మంది నూతన సర్పంచులకు నిర్వహిస్తున్న జనరల్ ఓరియంటేషన్ శిక్షణలో అధికారులు వ్యవహరించిన తీరు అనుచితమని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జ్ తిప్పారపు సంపత్ విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులను అవమానించే విధంగా నిలబెట్టి, అధికారులు కుర్చీల్లో కూర్చోవడం సరికాద న్నారు. డిపిఓ జగదీశ్వర్, డిఎల్పిఓ శ్రీనివాస్, సంబంధిత ఎంపీడీవోలు, ఇతర అధికారులు సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను నేరస్తుల మాదిరిగా నిలబెట్టి ఫోటోలు దిగడం అవమానకరమని పేర్కొన్నారు. సర్పంచులకు వెంటనే క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడీ రవితేజ, యూత్ కాంగ్రెస్ నాయకులు చిట్యాల రేవంత్, రేణిగుంట్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నీటి వేళలో కౌన్సిలర్ చేయూత

## – మృతుని కుటుంబానికి అండగా..

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని 17వ వార్డుకు చెందిన తిప్పర్తి మాధవచారి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. అద్దె ఇంట్లో నివసిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం ముందుకు వచ్చి సహాయహస్తం చాపారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి వైకుంఠ ధామంలో అవసరమైన ఏర్పాట్లు చేయించగా, లయన్స్ క్లబ్ సహకారంతో ఫ్రీజర్ బాక్స్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. గురువారం జరిగిన అంత్యక్రియల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తిప్పర్తి ఎల్లవ్వకు సుమారు రూ.5,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు భోజన సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం మాట్లాడుతూ, నా వార్డు ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా ముందుండి సహాయ సహకారాలు అందిస్తాను.. అని తెలిపారు.ఆపద సమయంలో అండగా నిలిచిన కౌన్సిలర్ చర్యలను స్థానికులు అభినందించారు.

# మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం



వేద న్యూస్, బోయినిపల్లి:

బోయినపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ https:// telanganams. cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఓపెన్ కేటగిరీ విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులకు రూ.125 దరఖాస్తు రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థుల రవాణా సౌకర్యార్థం కరీంనగర్, వేములవాడ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కరీంనగర్ నుంచి బావుపేట, విలాసాగర్, అనంతపల్లి, కోదురుపాక మీదుగా, అలాగే వేములవాడ నుంచి అయ్యోరుపల్లి, రత్నంపేట, రామన్నపేట, దేశాయిపల్లి, స్తంభంపల్లి, గంగాధర మీదుగా పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో భవిత సెంటర్ విద్యార్థి ప్రతిభ

**వేద న్యూస్, చొప్పదండి:**



పట్టణంలోని హరికిషన్ ఇప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు గల భవిత సెంటర్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ విషయాన్ని భవిత సెంటర్ ఐఈఆర్పీలు పెద్ది శ్రీనివాస్, డి. పద్మ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో భవిత సెంటర్ సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థి ఏ. ఆదిత్య (8వ తరగతి) ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి మెడల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి ఆదిత్యకు మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. దివ్యాంగ విద్యార్థులకు కూడా క్రీడల్లో రాణించే సామర్థ్యం ఉన్నదని, వారిని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మెడల్ సాధించిన ఆదిత్యను మండల విద్యాధికారి పి. మోహన్, ఫిజికల్ డైరెక్టర్ కే. కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# చిన్నారులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండల పరిధిలోని ఫైల్ తండా గ్రామంలో బానోత్ గాంధీ–లక్ష్మి దంపతుల కుమార్తెలు గౌతమి, ప్రియాంకలకు చెవుల కుట్టు వేడుక, కుమారుడు అక్షిత్‌కు పంచకట్టు వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. చిన్నారులను పేరుపేరునా ఆశీర్వదిస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో బోడ సెత్రం, హాట్కార్ రాంబాబు, బానోత్ రాందాస్, రాములు, హనుమా, రవి, హరి, గుంపడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గదుల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి



- పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

పీఎంశ్రీ పథకం కింద ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆమె నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులు మరియు కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. రానున్న 20 రోజుల్లో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న తరగతి గదుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి జీవితంలో కీలక దశ అని పేర్కొంటూ, అన్ని సబ్జెక్టులను శ్రద్ధగా చదివి సమాధానాలు రాయాలని సూచించారు. రాసిన సమాధానాలను తిరిగి పరిశీలించి తప్పులు సరిదిద్దుకోవాలని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ ఇల్లు పనులు త్వరగా పూర్తి చేయాలి**

బొప్పాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారు మంద స్వరూపతో మాట్లాడి, నిర్మాణ పురోగతిని ఆరా తీశారు. ప్రభుత్వ సహాయంగా మూడు విడతల్లో రూ.4 లక్షలు జమయ్యాయని లబ్ధిదారు తెలిపారు. మిగతా పనులను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధం కావాలని, ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, హౌసింగ్ డీఈ ముజఫర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణరావు, ఎంఈఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు ప్రణాళికతో చదివితే విజయం సొంతం

- పదో తరగతి దశ విద్యార్థుల జీవితంలో కీలకం
- గురుకుల ప్రిన్సిపాల్ స్వాతి




**వేద న్యూస్, చొప్పదండి:**

విద్యార్థులు ముందస్తు ప్రణాళికతో చదువుకుంటే విజయం సొంతమవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల ప్రిన్సిపల్ ఎల్. స్వాతి అన్నారు. పట్టణంలోని గురుకులంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి దశ విద్యార్థుల జీవితంలో కీలకమని పేర్కొన్న ఆమె, నిజ జీవితంలో రాణించాలంటే సత్ప్రవర్తన, ఏకాగ్రత అవసరమని సూచించారు. లక్ష్యసాధనకు క్రమశిక్షణ, పట్టుదల ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం గురుకుల సిబ్బందిని సన్మానించారు. విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్వప్న, గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంభోజి శేఖర్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి దేవేందర్, ఉపాధ్యక్షుడు సంభోజి సునీల్, కార్యవర్గ సభ్యుడు పిట్ట భూమయ్య, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

- హాజరైన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామంలో పర్వతు కనకయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారుడికి పట్టు వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారుడి ఇంట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సన్న బియ్యంతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు, ఆరెకట్ల గురవయ్య, సర్పంచ్ మేళ్లచెరువు సత్యనారాయణ, ఉపసర్పంచ్ నంద్యాల సతీష్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా చిన్న నాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, షేక్ లాలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ కు సన్మానం

- సత్కరించిన ఖమ్మం గ్రానైట్ మార్కర్స్ యూనియన్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా తమ్మినేని నవీన్ నియమితులైన సందర్భంగా ఆయన స్వగ్రామం ఎదులాపురంలో ఖమ్మం గ్రానైట్ మార్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. తమ్మినేని నవీన్ ప్రజల సమస్యల పట్ల కట్టుబడి పనిచేసే వ్యక్తి అని ప్రశంసించారు. గ్రానైట్ రంగానికి అనుబంధంగా ఉండి, రంగానికి సంబంధించిన సమస్యలపై పోరాడే నిబద్ధత ఉన్న నాయకుడని పేర్కొన్నారు. అందర్నీ కలుపుకుపోయే స్వభావం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. యూనియన్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, ఎల్లప్పుడూ తమకు తోడుగా ఉంటానని తమ్మినేని నవీన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు పాషా, గిరి, భద్రం, సెక్రటరీ జానీ, ట్రెజరర్ రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీ నరసింహారావు, ఈసీ మెంబర్ వడ్లకొండ శీను తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన పిల్లలే.. ఆరోగ్యవంతమైన సమాజం

- ఎస్ఆర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థుల గ్రామీణ అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, హనుమకొండ:**

ఎస్ఆర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డా. జి. శ్రీకర్ రెడ్డి, డా. రాథోడ్ లాల్, గ్రామ సర్పంచ్ బుర్ర రంజిత్, జెడ్పీహెచ్ఎస్ మడిపల్లి ప్రధానోపాధ్యాయులు జి. నర్సయ్య, బయో సైన్స్ ఉపాధ్యాయులు కె. రవీంద్రన్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలలో సమతుల్య ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్య అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. చివరి సంవత్సరం విద్యార్థులు గ్రామ వీధుల్లో నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తూ ఆరోగ్య అవగాహన కల్పించారు. "పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట కృషివిజ్ఞాన కేంద్రం ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో భాగంగా గురువారం కనగర్తి గ్రామంలో బీ ఆర్ సి రైతు గూడా కనకయ్య బీ ఆర్ సి వద్ద బీ ఆర్ సి ఇన్చార్జ్ మురళీధర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో వచ్చే.. మోగిపురుగు, పచ్చపురుగు, తాటిఆకుతెగుళ్ళు, అగ్గితెగులు, పాముపొడ తెగుళ్ళు, ఎలా నివారించుకోవాలో వారికి క్లుప్తంగా వివరించారు.కార్యక్రమంలో నీమాస్త్రం, జీవామృతం, పుల్లటి మజ్జిగ వాటి ఉపయోగాలు, పనిచేసే విధానం పురుగుల పైన తెగుళ్లపైన పనిచేసే విధానం గురించి రైతులకు తెలిపారు. ప్రత్యక్షంగా అగ్నిఅస్త్రం తయారుచేసి రైతులకు చూపించారు. తక్కువ ఖర్చు తో.. పురుగులు, తెగుళ్లను ఎలా అరికట్టాలో చెప్పారు భూమి ఆరోగ్యం , మానవాళి ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలో వెల్లడించారు.కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలేటర్స్ ఆకేంద్ర, మమత, కిరణ్ సుమారుగా 30 మంది రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

# మానవ సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యాలు కావాలి

- కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

మానవ సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సుస్థిర ప్రగతే దేశ లక్ష్యాలు కావాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'ఇంటిగ్రేటింగ్ ఎస్‌డీజీస్ ఫర్ వికసిత్ భారత్ ఏ 2047' అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సేవలు, వివక్ష నిర్మూలన వంటి అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ అగ్రదేశంగా ఎదగాలని, యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న నేపథ్యంలో అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అవసరమని సూచించారు. రిజిస్ట్రార్




ఆచార్య వి. రామచంద్రం యువత మార్పుకు దూతలుగా నిలవాలని, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సదస్సులో పలు విభాగాధిపతులు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ జర్నల్ ఆఫ్ ఇంగ్లీష్ స్టడీస్, కాకతీయ జర్నల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రత్యేక సంచికలను ఆవిష్కరించారు. సభ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై ఘనంగా ముగిసింది.

# అక్రమ ఇసుక కుప్పలు సీజ్

- కొరడా ఝుళిపించిన పోలీస్, రెవెన్యూ శాఖ



**వేద న్యూస్, పాపన్నపేట:**

మండల కేంద్రంలోని గాజులగూడెం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను పోలీస్, రెవెన్యూ సంయుక్త బృందం సీజ్ చేసింది. గాడిదల ద్వారా ఇసుకను తరలించి అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 ఇసుక కుప్పలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీస్, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

# హౌస్ సర్జన్‌లకు ఎథిక్స్ అవేర్‌నెస్ కార్యక్రమం




**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీలో గురువారం హౌస్ సర్జన్‌ల కోసం ఎథిక్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సంధ్య సుంకరణేని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య వృత్తిలో నైతిక విలువలు, బాధ్యతలు, చట్టపరమైన అవగాహనపై వివరణ ఇచ్చారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు డా. శేషుమాధవ్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ డా. నరేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని, రోగులతో వ్యవహరించే విధానం, పారదర్శకత, నిబంధనలపై హౌస్ సర్జన్‌లకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా. సంధ్య మాట్లాడుతూ, వైద్య వృత్తి పవిత్రమైన బాధ్యత అని, ప్రతి వైద్యుడు నైతిక ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం హౌస్ సర్జన్‌లతో హిప్పోక్రాటిక్ ప్రమాణం చేయించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసి, అతిథులను సన్మానించారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం



**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు శ్రీశైలంమమత వివాహం గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మదేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, మండల నాయకులతో కలిసి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎరుకల భూమయ్య కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, పాపన్నపేట సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ గురుమార్తి గౌడ్, నాయకులు సోములు, దుర్గయ్య, బాబా గౌడ్, అంటోని, మాణిక్యరెడ్డి, చంద్రశేఖర్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దొరికిన సెల్‌ఫోన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగింత



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ నుంచి సిద్దాపూర్‌కు బుధవారం రాత్రి వెళ్తున్న సమయంలో రాణంపల్లి సమీపంలో ఒక మొబైల్ ఫోన్ దొరికినట్లు హరికృష్ణ తెలిపారు. గురువారం ఆ మొబైల్‌ను రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సాయన్నకు అప్పగించారు. సామాజిక బాధ్యతతో వ్యవహరించిన హరికృష్ణను ఎస్సై సాయన్న, సిబ్బంది అభినందించారు. ఆయన నిజాయితీని ప్రశంసించారు.

# శాంతి కమిటీ సమావేశం

**వేద న్యూస్, రుద్రూర్:**




రుద్రూర్ గ్రామంలో ఇటీవల ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో గ్రామంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కులమత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. శాంతి, సామరస్యంతో ఉంటే ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోవని పేర్కొన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో ఇన్ ఫాంట్ విద్యార్థుల ప్రతిభ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



రాష్ట్ర స్థాయిలో ఈనెల 17నుండి 23వరకు జరిగిన సీఎం కప్ పోటీలలో 14వ డివిజన్ రెడ్డిపాలెంలోని ఇన్ ఫాంట్ జీసస్ కాన్వెంట్ హైస్కూల్ కు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ కృపా మరియా తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ కృపా మరియా మాట్లాడుతూ గచ్చిబౌలిలో జరిగిన బేస్ బాల్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన శ్రీజ, రితిక, అక్షిత, శ్రీనీరజ, అక్షయ, అక్షిత, విగ్నేష్ మెదక్ లో జరిగిన సాఫ్ట్ బాల్ పోటీలలో అచ్యుత, శుభ కీర్తి, తనుశ్రీ, సాయి లిఖిత, బిందు, సరూర్ నగర్ లో జరిగిన యోగ పోటీలలో వర్ధిని సిద్దిపేటలో జరిగిన సైక్లింగ్ పోటీలలో సిరి చందన, ఆశ్రిత, అద్వైత్ రెడ్డి నల్గొండలో జరిగిన కోకో పోటీలలో కీర్తి గచ్చిబౌలిలో జరిగిన వాలీబాల్ పోటీలలో వర్ధిని ఖమ్మంలో జరిగిన బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో త్రివేణి, సిరి చందన, నవ్య, సంజన, మనిషా, సయ్యద్ అమన్, హృదయ్ తేజ్, శాల్విక్, అబ్దుల్ మన్నన్, చరణ్, అభినవ్ లు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు పొందినట్లు తెలిపారు. గతంలో కూడా తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పలు బహుమతులు గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ కృపా మరియా తెలిపారు. ఈసందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులతో పాటు కోచ్ లు కుమారస్వామి, శ్రీకాంత్ లను ప్రిన్సిపల్ అభినందించారు.

# బదిలీపై వెళ్తున్న సర్వేయర్‌కు సన్మానం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట తహసీల్దార్ కార్యాలయం లో విధులు నిర్వహించిన సర్వేయర్ ఎర్ర ప్రగడ బదిలీపై వెళ్తుండగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని గట్లకానిపర్తి గ్రామ శివారులో వెళ్లే ఎన్హెచ్ రహదారి నిర్మాణానికి అవసరమైన సర్వే, మ్యాపింగ్ పనులను సకాలంలో పూర్తి చేసి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రైతులు దరఖాస్తు చేసిన సర్వేలను తక్షణమే పూర్తి చేసి నివేదికలు అందించేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, ఎంఆర్ఐ రమేష్‌బాబు, ఏఆర్ఐ రమేష్, జీపీఓలు వంగేటి సత్యం, దేవేందర్, నరేష్, తులసి రామకృష్ణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సిటీ కళాశాలలో పరిశోధనా విధానాలపై వర్క్‌షాప్

**వేద న్యూస్, హైదరాబాద్:**



ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పరిశోధనా విధానాలు' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. హానర్స్ ప్రోగ్రామ్ డిగ్రీ విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డా. పి. శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యలో పరిశోధన ప్రాముఖ్యతను వివరించారు. విశ్లేషణాత్మక, విమర్శనాత్మక దృక్పథం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గుజరాత్ కేంద్ర విశ్వవిద్యాలయం నుండి డా. బి. జగన్నాథం ప్రధాన వక్తగా పాల్గొని పరిశోధనా రూపకల్పన, డేటా సేకరణ, విశ్లేషణ, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఇగ్నో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డా. సౌజన్య పరిశోధన నిర్వహణలో అనుసరించాల్సిన ఆచరణాత్మక అంశాలను వివరించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమానికి విభాగాధిపతి డా. ఎల్. తిరుపతి కన్వీనర్‌గా వ్యవహరించగా, అధ్యాపకులు పాల్గొన్నారు.

# డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు మెంటరింగ్‌కు కేయూ సిద్ధం




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ఉన్నత విద్యలో నైపుణ్యాభివృద్ధి, నాణ్యత పెంపు లక్ష్యంగా విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు మెంటరింగ్ అందించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం-2020 మార్గదర్శకాల మేరకు ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాధారిత కోర్సులు, క్రెడిట్ ట్రాన్స్‌ఫర్, మల్టిపుల్ ఎంట్రీ ఎగ్జిట్ వంటి అంశాలను డిగ్రీ విద్యలో భాగం చేయాలని సూచించారు. పరిశ్రమ-విశ్వవిద్యాలయ అనుసంధానాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మొదటి దశలో విశ్వవిద్యాలయ పరిధిలోని 41 ప్రభుత్వ డిగ్రీ, 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఈ మెంటరింగ్ కార్యక్రమంలో భాగమవుతాయని తెలిపారు. తొలి విడతగా 10 కళాశాలల్లో మార్చి నుంచి ప్రత్యేక మెంటరింగ్ ప్రారంభమవుతుంది. యూనివర్సిటీ అధ్యాపకులు ప్రధాన మెంటర్లుగా వ్యవహరించి అతిథి ఉపన్యాసాలు, కెరీర్ మార్గనిర్దేశం, పరిశోధన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుకు దోహదపడుతుందని తెలిపారు. సమావేశంలో డీన్లు, ప్రొఫెసర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**వేద న్యూస్, పాపన్నపేట:**



పాపన్నపేట మండలం నామపూర్ గ్రామానికి చెందిన రైతు నర్సింహులు విద్యుత్ షాక్‌కు గురై పొలంలో బుధవారం మృతి చెందిన ఘటనపై మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింహుల మృతి బాధాకరమని పేర్కొంటూ కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు.

# పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

**- ఏరియా డిప్యూటీ పీఎం ఆసిఫ్**

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపునకు సింగరేణి ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏరియా డిప్యూటీ పీఎం ఆసిఫ్ తెలిపారు. గురువారం సిఈఆర్ క్లబ్‌లో క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసిన కార్మికులతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏరియాకు మొత్తం 112 క్వార్టర్లు ప్రకటించగా 101 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సీనియారిటీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి తొలి విడతలో 17 మందికి క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, సివిల్ ఈఈ రాజు, మేనేజ్‌మెంట్ ట్రైనీ ఐఈడి శ్యామ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేటలో ఘనంగా స్వయంపాలన దినోత్సవం

**వేద న్యూస్, పాపన్నపేట:**



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలో పాఠాలు బోధించి ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరి కలెక్టర్‌గా, సంధ్య అదనపు కలెక్టర్‌గా, జనార్దన్ డీఈఓగా, మల్లికార్జున్ ఎంఈఓగా, హిమజ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహించారు. గౌతమి, సల్మా, ఆక్షిత, అక్షర, ధనుష్, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ 2026 మీడియా డైరీ ఆవిష్కరణ



**వేద న్యూస్, మంచిర్యాల:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రూపొందించిన 2026 మీడియా డైరీని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ డైరీని విడుదల చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, జిల్లా కార్యదర్శి సత్య గౌడ్ డైరీలో పొందుపరిచిన విశేషాలను వివరించారు. ప్రభుత్వ విభాగాలు, ప్రజాప్రతినిధుల సంప్రదింపు వివరాలు, మీడియా చట్టాలు, మార్గదర్శకాలు, క్యాలెండర్ సమాచారం వంటి అంశాలతో డైరీని సమగ్రంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ డైరీ జర్నలిస్టులకు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్న మీడియా ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కామెర వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శానకొండ శ్రీనాథ్, మడ్డి వేణుగోపాల్ గౌడ్, సభ్యులు సుమన్, మణిరాజ్, ప్రవీణ్, సతీష్, సురేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయండి

- మార్చి తొలి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట 2,160 ఇండ్ల నిర్మాణం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట:**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి రూ. 22,500 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హుజూర్నగర్‌లో రామస్వామి వద్ద 110 ఎకరాల్లో రూ. 125 కోట్లతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల పనులను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్రతి బ్లాక్‌ను కాలినడకన తిరిగి అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, త్రాగునీరు, మొక్కల నాటడం, వైట్‌వాష్ పనుల పురోగతిని సమీక్షించారు. మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి పూర్తి చేయడం తన చిరకాల స్వప్నమని చెప్పారు. ఒక్కో ప్లాట్ విస్తీర్ణం 325 చదరపు అడుగులు ఉండగా, ఒక్కో ఇండ్లపై సుమారు రూ. 6 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. అదనంగా మౌలిక వసతుల కోసం రూ. 75 కోట్లు మంజూరు చేసి పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తున్నామని వెల్లడించారు. మార్చి తొలి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తొలి విడతలో 1,000 మంది లబ్ధిదారులకు ఇండ్లు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని, ఎలాంటి అవినీతి సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కే. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**వేద న్యూస్, పాపన్నపేట:**

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం నార్సింగి ప్రధాన చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతో పాటు వాహనాల పత్రాలను పరిశీలించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర జాతర ప్రచార రథాల ప్రారంభం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో కాకతీయ కాలం నుంచి ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి జాతరకు సంబంధించిన ప్రచార రథాలను దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, స్థానిక సర్పంచ్ పిల్లల సందీప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పురాతన చరిత్ర కలిగిన శ్రీ రామలింగేశ్వర దేవాలయ వైభవాన్ని ప్రతి గ్రామానికి చాటిచెప్పేందుకు ప్రచార రథాలు ఉపయోగపడతాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాలెం రాజు, ధర్మకర్తలు బచ్చు జానయ్య, ముత్యాల వెంకటయ్య, కత్తుల లింగయ్య, పళ్ళ శేఖర్, కోల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన మిత్రుని కుటుంబానికి క్లాస్‌మేట్స్ అండ

**వేద న్యూస్, కామేపల్లి:**

చిన్ననాటి స్నేహితుడు మరణించినా, అతని కుటుంబానికి తామున్నామని పదవ తరగతి సహాధ్యాయులు చాటిచెప్పారు. గార్ల మండలం కొత్త తండా గ్రామానికి చెందిన ధారావత్ భద్రు ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో పడింది. భద్రు సుమారు 20 ఏళ్ల క్రితం గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెళు తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో భార్య, ఇద్దరు కుమారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితిని చూసి చలించిన పదవ తరగతి మిత్రబృందం, భద్రు దశదినకర్మ సందర్భంగా రూ. 14,000 నగదు సేకరించి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బోడ మంగ్యాజి నాయక్ మాట్లాడుతూ.. భద్రు మా ప్రాణస్నేహితుడు. ఆయన కుటుంబానికి రాబోయే రోజుల్లో కూడా అండగా ఉంటాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ



నాయక్, బోడ మంగ్యాజి నాయక్, శ్రీనివాస్, భావసింగ్, రమేష్, లస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

### – జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**




జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సరం ద్వితీయ భాష పేపర్1 పరీక్ష గురువారం ప్రశాంతంగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధి కారి రవిబాబు తెలిపారు. ఈ పరీక్షకు జనరల్, ఒకేషనల్ విభాగాలకు కలిపి 16,829 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 16,525 మంది పరీక్షకు హాజరయ్యారు. 304 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు సజావుగా పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

**వేద న్యూస్, కారేపల్లి:**



ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాల గోడ పత్రికను సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ టోనీ గురువారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. వచ్చే మార్చి 2న స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఉదయం 9:45 గంటలకు అభిజిత్ లగ్నంలో దివ్య కల్యాణం జరగనుండగా, అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర గ్రామ వీధుల్లో కొనసాగుతుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి నెహ్రూ, కార్యనిర్వహణాధికారి వేణుగోపాలాచార్యులు, ఇన్స్పెక్టర్ సమత, మహిళా నాయకురాలు పగడాల మంజుల, వ్యాపారవేత్తలు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

### – సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



ప్రజా ప్రభుత్వంతోనే సొంత ఇల్లు లేని పేదల కల సాకారం అవుతుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు సూర్యపెల్లి జ్యోతిశ్రీను నూతన గృహాన్ని ఆయన ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును, గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో కుట్టుమిషన్‌తో పాటు ఎంబ్రాయిడరీ, బుటిక్ వంటి శిక్షణలు అందిస్తారని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశ్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ వినోద్, గ్రామ సెక్రటరీ స్వరాజ్యం, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

### – బ్లాక్ దందాను అరికట్టాలి
### – సీపీఐ నాయకుడు పైడిపల్లి రాజు



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలో సిగరెట్లు, పాన్ మసాలాలు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆరోపించారు. తూనికలుకొలతల శాఖ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ము తున్నారని, ప్రశ్నించిన వినియోగదారులతో అనుచితం గా ప్రవర్తిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కంపెనీలు నిర్ణయించిన ధరలకు మించి విక్రయించడం ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన అని అన్నారు. అధిక ధరలకు విక్రయాలు కొనసాగిస్తున్న దుకాణాలపై తక్షణమే తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు

## కేటీఆర్ రాష్ట్ర నాయకుడు కాదు..

### – మున్సిపల్ ఎన్నికల్లో తేటతెల్లం – టోనీ విమర్శలు



**వేద న్యూస్, తంగళ్లపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నాయకులు కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. కేటీఆర్ రాష్ట్ర స్థాయి నాయకుడు కాదని, సిరిసిల్లకే పరిమితమైన నాయకుడని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో కేటీఆర్ నాయకత్వం స్పష్టంగా బయటపడిందని, ప్రజలు మార్పు వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలలో 97 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసిందని పేర్కొన్నారు. సిరిసిల్లలో కూడా కాంగ్రెస్ పార్టీ మెరుగైన స్థానం సాధించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై విష ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించిన వారు, పదేళ్ల పాలనలో సిరిసిల్ల అభివృద్ధి విషయంలో కేటీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని అన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో ప్రవీణ్ టోనీతో పాటు లింగాల భూపతి, కటకం రాజశేఖర్, బైరినేని రాము, సత్తు శ్రీనివాస్ రెడ్డి, మునిగల రాజు, గ్యాదగోని సాగర్, తిరుపతి రెడ్డి, పొన్నాల పరుశురాం, అరెపల్లి బాలు, ఎగుర్ల ప్రశాంత్, బండి పరుశురాం, ఉపసర్పంచ్ బాను తదితరులు పాల్గొన్నారు.

## భారీ అగ్నిప్రమాదం..

**వేద న్యూస్ హైదరాబాద్ :**




జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంగళ గౌరీ వస్త్ర దుకాణంలో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిప్రమాదం కారణంగా భారీ ఎత్తు మంటలు ఎగిసి పడుతుండటంతో దుకాణం కాలిబూడిదైంది. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలు అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మెయిన్ రోడ్డు కావడంతో అగ్నిప్రమాదం కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

### – పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ చావిడి ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దవాఖాన సౌజన్యంతో 9వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ఇప్పటివరకు 9 ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా 350 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించామని తెలిపారు. మహిళల కోసం ఖాదీ గ్రామోద్యోగ సంస్థాన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రేకుర్తి కంటి దవాఖాన డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న వారు ఈ



శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ కంటి ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కార్యక్రమాలకు మున్సిపల్ పరిపాలన నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 27, 2026

# ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

## – ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్య పోరాట సమితి

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



నాగర్ కర్నూల్‌లో జరిగిన పాప హత్య ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, కేసులో ఉన్న ఎనిమిది మంది నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్య పోరాట సమితి మండల సలహాదారు, న్యాయవాది పసుల కృష్ణ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఐక్య పోరాట సమితి, రజక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేవాలయ దర్శనానికి వెళ్లిన రజక కుటుంబంపై దాడి చేసి పాప మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు కంచర్ల నర్సింలు, ఐక్య కార్యచరణ కమిటీ మండల కన్వీనర్ బండారి బాలరెడ్డి, కదిరే భాస్కర్ గౌడ్, సాయి ప్రేమ్, ఎడ్ల రాజ్‌కుమార్, లింగాల సందీప్, జి. మల్లేశం, జి. సురేష్, పందిళ్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మనోధైర్యం పెంపొందించేందుకే ఎస్ఎఫ్ఐ ప్రతిభ పరీక్ష

## – జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీరాముల సంజన

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారిలో మనోధైర్యం పెంపొందించేందుకే ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీరాముల సంజన తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వేములవాడ మండల కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వేములవాడలోని పలు పాఠశాలల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజన మాట్లాడుతూ, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఉన్న పరీక్షా భయాన్ని తొలగించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలతో పాటు విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కదరీ శివ తదితరులు పాల్గొన్నారు.

# కంటెంట్‌కు కిరీటం కట్టిస్తున్న యువ నిర్మాతలు

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినీ పరిశ్రమలో కొత్త తరహా ఆలోచనలు, కొత్త వ్యూహాలు, కొత్త కథనాలతో నవశకం ఆరంభమైంది. ఒకప్పుడు నిర్మాణం అంటే భారీ బడ్జెట్, స్టార్ నటీనటులు, విదేశీ చిత్రీకరణలే ప్రధాన ఆకర్షణగా ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కథే రాజు, కంటెంట్‌నే కిరీటం అనే నమ్మకంతో ముందుకు సాగుతున్న యువ నిర్మాతలు టాలీవుడ్ రూపురేఖలను మెల్లగా మార్చేస్తున్నారు. వాణిజ్య పరిమితులను దాటి, ప్రయోగాత్మక కథలకు కూడా స్థానం కల్పిస్తూ ప్రేక్షకుల అభిరుచిని కొత్త దిశగా మలుస్తున్నారు. మెగా కుటుంబానికి చెందిన నిహారిక కొణిదెల నిర్మాతగా తనదైన గుర్తింపు సంపాదించుకుంటున్నారు. ఆమె స్థాపించిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. చిన్న తెర నుంచి డిజిటల్ వేదికల వరకు విభిన్న కంటెంట్‌ను అందిస్తూ ఆమె సంస్థ విశ్వసనీయతను పెంచుకుంది. 'ముద్దపప్పు ఆవకాయ్' వెబ్ శ్రేణి నుంచి 'కమిటీ కుర్రోళ్లు' వంటి చిత్రాల వరకు ఆమె నిర్మాణాలు యువతను ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం సంగీత్ శోభన్ కథానాయకుడి గా తెరకెక్కుతున్న 'రాకాస' చిత్రం నిర్మాణంలో ఉండగా, భవిష్యత్తులో వరుణ్ తేజ్‌తో కూడిన ప్రాజెక్ట్ గురించి చర్చలు సాగుతున్నట్లు సమాచారం. కథా ఎంపికలో నూతనత, నిర్మాణంలో నాణ్యత అనే ద్వంద్వ లక్ష్యాలతో ఆమె ముందుకు సాగుతున్నారు. ఇక యువ నిర్మాత వంశీ నందిపాటి పరిశ్రమలో విభిన్న శైలిని చూపిస్తున్నారు. నిర్మాతగానే కాకుండా పంపిణీదారుడిగా కూడా రాణిస్తూ, చిన్న చిత్రాలకు పెద్ద వేదికలను అందిస్తున్నారు. 'రాజు వెడ్స్ రాంభాయ్', 'లిటిల్ హార్ట్స్', 'ఈషా', 'మిత్రమండలి', 'శ్రీ చిదంబరం గారు', 'హే బలవంత్' వంటి చిత్రాల విడుదలలో కీలక పాత్ర పోషించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న 'సంప్రదాయని సుప్పిని సుద్దపూసని' చిత్రం కూడా వినూత్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తక్కువ బడ్జెట్‌లో మంచి కథలను అందించడం ద్వారా మార్కెట్‌లో స్థిర స్థానం సంపాదించుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ అధినేత సాహు గారపాటి వరుస విజయాలతో అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' విజయంతో మంచి ఊపులో ఉన్నారు. కథా ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, దర్శకులకు స్వేచ్ఛనిచ్చే విధానం ఆయన సంస్థ ప్రత్యేకతగా నిలుస్తోంది. మరోవైపు ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'హనుమాన్' విజయంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' అనే విభిన్న కథాంశంతో కూడిన చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్థానిక కథను విశ్వవ్యాప్తంగా తీసుకెళ్లగల సామర్థ్యం ఉన్న నిర్మాతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. లెజెండరీ నిర్మాత అశ్వినీ దత్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్న స్వప్న దత్, ప్రియాంక దత్ తమ వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ బ్యానర్ల ద్వారా కంటెంట్ ఆధారిత చిత్రాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 'మహానటి', 'జాతిరత్నాలు', 'సీతారామం' వంటి చిత్రాలు విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు వాణిజ్యవిజయాలు సాధించాయి. మహిళా నిర్మాతలుగా వారు చూపుతున్న ధైర్యం పరిశ్రమకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇక స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తరఫున రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ప్రయోగాత్మక చిత్రాలు కొత్త దర్శకులకు, నటులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. 'మళ్లీ రావా', 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'మసూద' వంటి చిత్రాలు విభిన్న కథాంశాలతో ప్రేక్షకాదరణ పొందాయి. భిన్న శైలులను ప్రోత్సహిస్తూ, కథనంలో సరికొత్త దృక్పథాన్ని తీసుకురావడంలో ఆయన ముందుంటున్నారు.

# మృణాల్‌తో కలిసి నటించాలని ఆశ.. అల్లు అర్జున్ స్పందన



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్తో కలిసి సినిమా చేయాలనే తన ఆసక్తిని వెల్లడించారు. పుష్ప 2 ది రూల్ చిత్రానికి ఉత్తమ నటుడిగా డెబ్బైవ ఫిల్మ్‌ఫేర్ దక్షిణ అవార్డును అందుకున్న సందర్భంగా మృణాల్ పంపిన శుభాకాంక్షలకు ఆయన సోషల్ మాధ్యమ వేదికగా స్పందించారు. ఇటీవల నిర్వహించిన ఫిల్మ్‌ఫేర్ దక్షిణ అవార్డుల వేడుకలో అల్లు అర్జున్ ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మృణాల్ ఠాకూర్ ప్రత్యేకంగా పూల గుత్తితో పాటు అభినందన సందేశాన్ని పంపారు. ప్రతి ప్రదర్శనలో చూపే అంకితభావం, తీవ్రత, ప్రతిభ స్ఫూర్తిదాయకమని ఆమె సందేశంలో పేర్కొన్నారు. మృణాల్ పంపిన బొకే, సందేశాన్ని తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న అల్లు అర్జున్, ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో కలిసి పని చేయాలని ఆశిస్తున్నట్లు రాశారు. ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించకపోవడంతో, ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తి రేపుతున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప' శ్రేణిలో మూడో భాగానికి సిద్ధమవుతుండగా, దర్శకులు లోకేశ్ కనగరాజ్, అట్లీలతోనూ చిత్రాలు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు మృణాల్ ఠాకూర్, అడివి శేష్తో కలిసి నటించిన డకాయిట్ విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌మృణాల్ కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.

# 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు హైకోర్టు బ్రేక్

**వేద న్యూస్ డెస్క్:**




వివాదాస్పద కథాంశంతో రూపొందిన హిందీ చిత్రం ది కేరళ స్టోరీ 2 విడుదలపై కేరళ హైకోర్టు మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి ఇరవై ఏడు తేదీన రాష్ట్రవ్యాప్తం గా విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రానికి విడుదలకు కేవలం ఒక్కరోజు ముందు కోర్టు స్టే విధించడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర ప్రతిస్పందనలకు దారితీసింది. చిత్రానికి ధ్రువీకరణ ఇచ్చిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ప్రక్రియపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. మత సంబంధ అంశాలు, సామాజిక సమన్వయంపై ప్రభావం చూపే విషయాలు ఉన్నప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత బోర్డుపై ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ చిత్రానికి ధ్రువీకరణ మంజూరు చేసే సమయంలో తగిన విధంగా పరిశీలన జరగలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించకుండా అనుమతి ఇచ్చినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషనర్ల వాదన ప్రకారం, ఈ చిత్రం కేరళ రాష్ట్రాన్ని ప్రతికూలంగా చూపిస్తూ మత సామరస్యానికి భంగం కలిగించే అంశాలను ప్రోత్సహించేలా ఉందని ఆరోపించారు. రాష్ట్ర పేరును ఉపయోగించి వాస్తవానికి సంబంధం లేని కథనాన్ని ప్రజల్లో ప్రచారం చేయడం ద్వారా అపోహలు సృష్టించే ప్రమాదం ఉందని వారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా యువతను ప్రభావితం చేసే విధంగా కథనం రూపొందించబడిందని, అది సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చని పిటిషన్‌లో పేర్కొ న్నారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ బెచు కురియన్ థామస్ కేరళ రాష్ట్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని వ్యాఖ్యానించినట్లు సమాచారం. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు కలసి జీవిస్తున్న రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయే విధంగా ఏ చిత్రమూ ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారని తెలిసింది. వ్యక్తి స్వేచ్ఛ, సృజనాత్మక స్వాతంత్ర్యానికి రాజ్యాంగ పరిరక్షణ ఉన్నప్పటికీ, అది సామాజిక బాధ్యతలతో ముడిపడి ఉంటుందని కోర్టు స్పష్టం చేసినట్లు న్యాయవర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రానికి ఇచ్చిన ధ్రువీకరణను మరో సారి సమగ్రంగా పరిశీలించాలని, పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. అప్పటి వరకు చిత్రం విడుదల చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనకు సిద్ధమైన థియేటర్లలో అనిశ్చితి నెలకొంది. స్టే నిర్ణయం వెలువడే వరకు ఈ అంశం రాజకీయ, అవకాశం ఉంది.

# తక్కువ రన్‌టైంతో వస్తున్న విష్ణు విన్యాసం.. అంచనాలు భారీగా


**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ యువ కథానాయకుడు శ్రీవిష్ణు ప్రధాన పాత్రలో నటించిన విష్ణు విన్యాసం చిత్రం ఫిబ్రవరి ఇరవై ఏడవ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. వరుస విజయాలతో మంచి ఊపులో ఉన్న శ్రీవిష్ణు ఈసారి వినోదాత్మక కథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. చిత్ర నిడివి కేవలం ఒక గంట యాభై తొమ్మిది నిమిషాలే అని చిత్రబృందం వెల్లడించడం తో పరిశ్రమ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. సాధారణంగా వినోద ప్రధాన చిత్రాలకు తక్కువ నిడివి ఉండటం పెద్ద ప్రయోజనంగా భావిస్తారు. కథ ఎక్కడా నెమ్మదించకుండా సాగిపోవడం వల్ల ప్రేక్షకులు ఆసక్తిగా పూర్తిగా సినిమా చూడగలరని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. మొదటి భాగం మొత్తం యువతను ఆకట్టుకునే సరదా సన్నివేశాలతో సాగుతుందని, రెండో భాగం కుటుంబ భావోద్వేగాల చుట్టూ తిరుగుతూ హృదయానికి హత్తుకునేలా ఉంటుందని శ్రీవిష్ణు వెల్లడించారు. ఇప్పటికే సామజవరగమన, ఓం భీమ్ బుష్ వంటి విజయాలతో మంచి గుర్తింపు పొందిన శ్రీవిష్ణు, మరోసారి అదే తరహా వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నారు. అదే రోజున విడుదల కావాల్సిన మృత్యుంజయ్ చిత్రం మార్చి ఆరవ తేదీకి వాయిదా పడటంతో 'విష్ణు విన్యాసం'కు స్వతంత్ర విడుదల దక్కింది. వాస్తు పిచ్చి కలిగిన ఓ యువకుడి చుట్టూ తిరిగే ఈ కథ ప్రేక్షకులను ఎంత మేరకు మెప్పిస్తుందో చూడాలి. అయితే అభిమానులు మాత్రం ఈ చిత్రం శ్రీవిష్ణు ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేస్తుందనే ఆశాభావంతో ఉన్నారు.

# 'రై రై రారా' లోడింగ్.. పెద్ది నుంచి మాస్ సింగిల్ రాబోతుంది

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న భారీ క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం పెద్ది నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వెలువడింది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం మంచి స్పందన అందుకోగా, ఇప్పుడు అభిమానులు ఎదురుచూస్తున్న రెండో గీతం 'రై రై రారా' విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. మార్చి రెండవ తేదీన ఈ మాస్ గీతాన్ని విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

సుమారు వెయ్యి మంది నర్తకులతో అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించిన ఈ పరిచయ గీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. "నీ అయ్య వడ్డీడ నీ బిడ్డ కడితేడ నువ్వేమి పొడిచావనే!" అంటూ సాగే పదాలు రామ్ చరణ్ పాత్రలోని ఊర మాస్ స్వభావాన్ని ప్రతిబింబిస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని ఏ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 27, 2026


# విండీస్ చిత్తు.. సౌతాఫ్రికా ఘన విజయం

**వేద న్యూస్ డెస్క్:**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన కీలక పోరులో దక్షిణాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు ఘన విజయాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ జాతీయ క్రికెట్ జట్టు నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 16.1 ఓవర్లలోనే ఛేదించి 9 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలిచింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని తమ సెమీఫైనల్ ఆశలను మరింత బలపరిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ప్రారంభంలోనే కొన్ని వికెట్లు కోల్పోయినప్పటికీ మధ్య వరుసలో షెఫర్డ్ అర్ధశతకంతో జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడు. హోల్డర్ కూడా సమయోచితంగా ఆడి కీలక పరుగులు సాధించాడు. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ పరుగులను నియంత్రించారు. ఎంగిడి మూడు వికెట్లు సాధించగా, రబాడా మరియు బోష్ తలో రెండు వికెట్లు తీసి విండీస్‌పై ఒత్తిడి పెంచారు. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ వేగంగా పరుగులు సాధించి మంచి ఆరంభాన్ని అందించాడు. అతని అవుట్ తర్వాత కెప్టెన్ ఐడెన్ మార్క్‌రమ్ మరింత దూకుడు ప్రదర్శిస్తూ అద్భుత అర్ధశతకం సాధించాడు. కేవలం 46 బంతుల్లోనే 82 పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ర్యాన్ రికెల్టన్ కూడా అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు. వెస్టిండీస్ బౌలర్లు వికెట్లు దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, దక్షిణాఫ్రికా బ్యాటర్ల ధాటికి ఎమాత్రమే ఒక వికెట్ సాధించగలిగాడు. మిగతా బౌలర్లు పరుగులను అదుపు చేయడంలో విఫలమయ్యారు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సమగ్ర ప్రదర్శన కనబరిచింది. బౌలింగ్‌లో కట్టుదిట్టత, బ్యాటింగ్‌లో దూకుడు కలగలిపి ప్రత్యర్థిపై ఆధిపత్యం చాటింది. సూపర్ 8 దశలో వరుస విజయాలతో ప్రొటీస్ జట్టు టైటిల్ దిశగా ధైర్యంగా అడుగులు వేస్తోంది. ఇక వెస్టిండీస్ మాత్రం తమ తదుపరి మ్యాచ్‌ల్లో గెలిచి పుంజుకోవాల్సిన అవసరం ఉంది.



# సచిన్ వికెట్ కోసం అక్తర్ సాహసం






**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన బౌలర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన షోయబ్ అక్తర్ తన కెరీర్‌కు సంబంధించిన కొన్ని సంచలన విషయాలను తాజాగా వెలుగులోకి తెచ్చాడు. గంటకు 161.3 కిలోమీటర్ల వేగంతో బంతిని విసిరి ఇప్పటికీ నిలిచిన అరుదైన రికార్డును సృష్టించిన అక్తర్, 199899 నాటి భారత పర్యటనను గుర్తు చేసుకుంటూ అప్పటి పరిస్థితులను వివరించాడు. ఆ కాలంలో భారత్‌పాక్ మ్యాచ్ అంటేనే ఉత్కంఠ, ఉద్వేగం, పోటీ భావం తారాస్థాయికి చేరుకునేదని పేర్కొన్నాడు. ఆ సమయంలో తన మోకాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నొప్పితో నడవడమే కష్టంగా ఉండేదని అక్తర్ వెల్లడించాడు. అయినప్పటికీ జట్టులో స్థానం కోల్పోతామనే భయంతో నొప్పిని దాచిపెట్టి మైదానంలోకి దిగాల్సి వచ్చిందని చెప్పాడు. మాజీ స్పిన్నర్ సక్లైన్ ముస్తాక్తో కలిసి రహస్యంగా నొప్పి నివారణ మాత్రలు, ఇంజెక్షన్లు తీసుకుని ఆడిన సందర్భాలను గుర్తు చేసుకున్నాడు. ఈ విషయం జట్టులోని సీనియర్లకు తెలిసితే తమను వెంటనే తప్పిస్తారనే ఆందోళన ఉండేదని, అందుకే ఎవరికీ తెలియకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించాడు. మైదానంలోకి దిగిన తర్వాత ప్రతి బంతి వేయడం శరీరానికి భారంగా అనిపించేదని, అయినప్పటికీ దేశ గౌరవం కోసం పోరాడాలనే తపన తమను ముందుకు నడిపించిందని అక్తర్ తెలిపాడు. శారీరకంగా నరకం అనుభవించినా, ప్రత్యర్థి జట్టును కట్టడి చేయాలనే సంకల్పమే తనకు ధైర్యం ఇచ్చిందని చెప్పాడు. అయితే ఈ శారీరక బాధలన్నింటికంటే కూడా భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ను ఔట్ చేయాలనే పట్టుదలే ఎక్కువగా ఉండేదని అక్తర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "సచిన్ వికెట్‌ను ఎవరు తీస్తారు?" అనే అంశంపై తనకూ, సక్లైన్‌కు మధ్య సరదాగా పందెం నడిచేదని వెల్లడించాడు. సచిన్‌ను ఔట్ చేయడం అనేది తమకు గర్వకారణమని, ఆ పోటీ భావమే మ్యాచ్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చేదని పేర్కొన్నాడు. ఆ కాలంలో భారత్ జట్టులో సచిన్‌తో పాటు విరాట్ సెహ్వాగ్ వంటి ధాటిగా ఆడే ఆటగాళ్లు ఉండటం వల్ల బౌలర్లకు సవాళ్లు ఎదురయ్యేవని అక్తర్ గుర్తు చేసుకున్నాడు. కొన్నిసార్లు తమ బౌలింగ్‌ను వారు దుమ్మురేపిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఆ పోటీతత్వమే తమను మరింత మెరుగుపరచిందని తెలిపాడు. సచిన్‌ను ఔట్ చేయడం అనేది ఒక మానసిక యుద్ధంలా ఉండేదని, అతని వికెట్ తీసిన రోజు ప్రత్యేకంగా గుర్తుండిపోతుందని చెప్పాడు. తన కెరీర్‌లో 46 టెస్టులు, 163 వన్డేలు ఆడిన అక్తర్ ఎప్పుడూ కెప్టెన్సీ చేపట్టకపోయినా, తన వేగంతోనే ప్రపంచ క్రికెట్‌ను ఆకట్టుకున్నాడు. గాయాలు, విమర్శలు, నిషేధాలు వంటి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నప్పటికీ, మైదానంలో తన ఆగ్రహ బౌలింగ్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. మొత్తంగా చూస్తే, అక్తర్ తాజా వ్యాఖ్యలు ఆ కాలం భారత్‌పాక్ పోటీ తీవ్రతను మరోసారి గుర్తు చేశాయి. గాయాలతో బాధపడుతూ కూడా దేశ గౌరవం కోసం పోరాడిన తమ అనుభవాలను వెల్లడించడం ద్వారా ఆటగాళ్ల అంకితభావం ఎంతటి స్థాయిలో ఉంటుందో ఆయన చెప్పకనే చెప్పాడు. క్రికెట్‌లో పోటీ, గౌరవం, పట్టుదల ఎలా కలిసిపోతాయో ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# భారత్ ఘన విజయం.. సెమీస్ ఆశలు సజీవం..?

**వేద న్యూస్ డెస్క్:**




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో మస్ట్‌గా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ జాతీయ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ కీలక పోరులో జింబాబ్వే జాతీయ క్రికెట్ జట్టుపై సమగ్ర ఆధిపత్యం చాటింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల వర్షం కురిపించిన టీమిండియా, అనంతరం కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని 184 పరుగులకు పరిమితం చేసి సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. అయితే భారీ విజయమే సాధించినప్పటికీ నెట్ రన్ రేట్ విషయంలో ఆశించినంత లాభం దక్కలేదు. టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నిర్ణయాన్ని భారత ఓపెనర్లు పూర్తిగా తప్పుగా నిరూపించారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సంజు శాంసన్, అభిషేక్ శర్మ జట్టుకు బలమైన పునాది వేశారు. అభిషేక్ శర్మ 55 పరుగులతో మెరిశాడు. మధ్య వరుసలో సూర్యకుమార్ యాదవ్ వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడగా, చివర్లో హార్దిక్ పాండ్యా అజేయ అర్ధశతకంతో చెలరేగాడు. తిలక్ వర్మ కూడా చివరి ఓవర్లలో ధాటిగా ఆడి జట్టును 20 ఓవర్లలో 4 వికెట్లకు 256 పరుగుల భారీ స్కోరుకు చేర్చాడు. జింబాబ్వే బౌలర్లు భారత బ్యాటర్ల ధాటికి తట్టుకోలేకపోయారు. నలుగురు బౌలర్లు తలో వికెట్ సాధించినప్పటికీ పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే ప్రారంభంలోనే ఒత్తిడికి గురైంది. భారత బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ వికెట్లు సాధించారు. జస్ప్రీత్ బుమ్రా తన ఖచ్చితమైన లైన్తో ఒత్తిడి సృష్టించగా, అర్ష్‌దీప్ సింగ్ కీలక వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి తన మాయాజాలంతో మధ్య వరుసను కట్టడి చేశాడు. సికందర్ రజా, ర్యాన్ బర్ల్ ప్రయత్నించినప్పటికీ భారత బౌలింగ్ దాడిని ఎదుర్కొనలేకపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 184 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో గ్రూప్ దశలో భారత్ పాయింట్లు పెంచుకుని సెమీఫైనల్ రేసులో నిలిచింది. అయితే సెమీస్ సమీకరణాలు ఇంకా పూర్తిగా స్పష్టత పొందలేదు. ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్ రేట్ అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో భారత్ చూపిన సమగ్ర ప్రదర్శన అభిమానుల్లో నమ్మకాన్ని పెంచింది. బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో క్రమశిక్షణ, ఫీల్డింగ్‌లో చురుకుదనయిశ్రీశ్రీ రకాలుగా జట్టు మెరుగైన ఆటతీరు కనబర్చింది. మొత్తంగా చూస్తే, ఒత్తిడిని జయిస్తూ భారత్ కీలక విజయాన్ని సాధించింది.

# జితేశ్ శర్మ సంచలన వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**




భారత యువ క్రికెటర్ జితేశ్ శర్మ చేసిన తాజా వ్యాఖ్యలు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ప్రతి ఆటగాడు తన జట్టు టాప్ ఆర్డర్ బలంగా ఆడి భారీ స్కోరు చేయాలని కోరుకుంటాడు. అయితే జితేశ్ మాత్రం తన జట్టు టాప్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగా అవుట్ కావాలని దేవుడిని ప్రార్థిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన జితేశ్ శర్మ, తన వ్యాఖ్యల వెనుక ఉన్న ఉద్దేశాన్ని స్పష్టంచేశారు. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో, వికెట్లు వరుసగా పడిపోయిన పరిస్థితిలోనే తనకు బ్యాటింగ్ చేసే అవకాశం వస్తుందని, అటువంటి క్లిష్ట సమయంలో జట్టును గెలిపిస్తేనే అసలైన సంతృప్తి కలుగుతుందని తెలిపారు. సవాళ్లను ఎదుర్కొంటూ జట్టును విజయపథంలో నడిపించడం ద్వారానే ఆటగాడిగా గుర్తింపు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒత్తిడి పరిస్థితుల్లో ఆడటం తనకు ఇష్టమని, అప్పుడు తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని జితేశ్ పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, కొందరు అభిమానులు ఆయన ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# లంక నిష్క్రమణపై సంగక్కర ఆవేదన

**వేద న్యూస్ డెస్క్:**

సహ ఆతిథ్య దేశంగా గర్వంగా బరిలోకి దిగిన శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టుకు తీవ్ర నిరాశ ఎదురైంది. స్వదేశీ అభిమానుల అండదండల మధ్య టైటిల్‌ను అందుకోవాలనే ఆశలతో పోరాటం ప్రారంభించిన లంక జట్టు, కీలక మ్యాచ్‌లో ఓటమి చవిచూసి ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి నిష్క్రమించింది. ఈ పరిణామం కేవలం ఒక టోర్నమెంట్ పరాజయం మాత్రమే కాదని, దేశ క్రికెట్ భవిష్యత్తుకు హెచ్చరికగా తీసుకోవాలని మాజీ కెప్టెన్ కుమార సంగక్కర స్పష్టం చేశారు. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ కీలక పోరులో న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టుపై శ్రీలంక బౌలర్లు ప్రారంభంలోనే ఆధిపత్యం చాటారు. 84 పరుగులకే ఆరు వికెట్లు పడగొట్టి కివీస్‌ను కట్టడి చేసిన లంక, మ్యాచ్‌ను తన వైపు తిప్పుకుంటుందనిపించింది. అయితే ఆ తర్వాత మిచెల్ శాంట్నర్, కోల్ మెక్‌కోంచీ జోడీ స్థిరంగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. నిర్ణాయక దశలో రచిన్ రవీంద్ర తన మాయాజాల స్పిన్‌తో నాలుగు వికెట్లు తీసి లంక బ్యాటింగ్‌ను కుదిపేశాడు. 169 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మధ్య వరుస వరుసగా కూలిపోవడంతో ప్రేక్షకుల ఆశలు ఒక్కసారిగా చెదిరిపోయాయి. చివరకు 61 పరుగుల భారీ తేడాతో ఓటమి ఖాయమైంది. ఈ పరాజయం అనంతరం స్పందించిన సంగక్కర భావోద్వేగంతో మాట్లాడారు. అభిమానుల ఆగ్రహం సహజమని, ఆటగాళ్ల మనోవేదనను తాను అర్థం చేసుకోగలనని చెప్పారు. అయితే సమస్య ఒక్క మ్యాచ్ పరిమితమైందికాదని, దీని వెనుక వ్యవస్థాత్మక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ క్రికెట్ శరవేగంగా మారుతున్నదని, కొత్త వ్యూహాలు, సాంకేతికత, ఫిట్‌నెస్ ప్రమాణాలు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. కానీ శ్రీలంక మాత్రం పాత విధానాలనే పట్టుకుని ముందుకు సాగుతోందని విమర్శించారు. "ఫలితాల్లో మార్పు కోరుకుంటూ అదే విధానాలను కొనసాగించడం వల్ల ప్రయోజనం ఉండదు. ఆలోచనా విధానం మారాలి. యువ ఆటగాళ్లను ప్రోత్సహించాలి. దేశీయ స్థాయిలో పోటీ ప్రమాణాలను పెంచాలి. సాంకేతిక విశ్లేషణ, శిక్షణ విధానాల్లో మార్పులు తీసుకురావాలి" అని సంగక్కర స్పష్టం చేశారు. మైదానంలోనే కాకుండా పరిపాలన వ్యవస్థలో కూడా సంస్కరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీలంక క్రికెట్ గతంలో ప్రపంచాన్ని ఆకట్టుకున్న విజయాలను సాధించిందని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే సమగ్ర పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి అని హెచ్చరించారు. మార్పును స్వీకరించకపోతే అంతర్జాతీయ వేదికపై లంక మరింత వెనుకబడే ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే దిశా నిర్దేశం సరిచేసి, భవిష్యత్తు కోసం పునాది వేయాలని సూచించారు. శ్రీలంక క్రికెట్ గతంలో ప్రపంచాన్ని ఆకట్టుకున్న విజయాలను సాధించిందని, కానీ ఇప్పుడు ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే సమగ్ర పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి అని హెచ్చరించారు. మార్పును స్వీకరించకపోతే అంతర్జాతీయ వేదికపై లంక మరింత వెనుకబడే ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే దిశా నిర్దేశం సరిచేసి, భవిష్యత్తు కోసం పునాది వేయాలని సూచించారు.ెుత్తంగా చూస్తే, ఈ ఓటమి శ్రీలంక క్రికెట్‌కు కఠినమైన కానీ అవసరమైన గుణపాఠంగా మారింది.



అభిమానుల ఆశలను తిరిగి నెరవేర్చాలంటే వ్యవస్థలో మార్పులు తీసుకురావడం, యువ ప్రతిభను వెలికితీయడం, ఆధునిక క్రికెట్‌కు అనుగుణంగా వ్యూహాలు అమలు చేయడం అనివార్యమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు లంక ముందు ఉన్న ప్రధాన సవాలు విమర్శలను అవకాశంగా మలచుకుని కొత్త ఆరంభానికి శ్రీకారం చుట్టడమే.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073